

నిండుకుండలా నాగార్జున సాగర్

- శ్రీశైలం నుంచి భారీగా వస్తున్న వరద నీరు
- 585 అడుగులకు చేరుకున్న ప్రాజెక్టు నీటిమట్టం
- నేడు తెరుచుకోనున్న డ్యాం గేట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు పెద్దఎత్తున వరద నీరు వస్తుండటంతో జలాశయం నిండుకుండలా ఉంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుతోంది. అంతేమేర దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను సోమవారం రాత్రికి 585 అడుగుల వరకు నీరు చేరింది. మంగళవారానికి 586 అడుగులు దాటనుంది. మంగళవారం ఉదయం సాగర్ డ్యామ్ గేట్లను ఎత్తనున్నారు. కుడి కాలువ ద్వారా 5394 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6634 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 28,785 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మంగళవారం ఉదయం సాగర్ డ్యాం గేట్లను ఎత్తనుండటంతో పర్యాటకుల సంఖ్య పెరగనుంది.శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేశుల నుంచి 2,42,724 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 1,47,195 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం డ్యాం స్పిల్‌వే ద్వారా నాలుగు గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 1,08260 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,581 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.80 అడుగుల వద్ద ఉంది.

పాలిసెట్‌లో మిగిలిన సీట్లు 11,182

- తుదివిడతలో 18,267 మందికి సీట్ల కేటాయింపు
- సెల్ఫ్ రిపోర్టింగ్‌కు నేటి వరకు గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక విడుదల చేశారు. పాలిసెట్‌లో 80,949 మంది అర్హత సాధించారని వివరించారు. వారిలో తుదివిడత కౌన్సెలింగ్‌లో 9,828 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. 115 పాలిటెక్నిక్ కాలేజీల్లో 29,449 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తుదివిడత కౌన్సెలింగ్‌లో 18,267 (62 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 11,182 (38 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఐదు ప్రభుత్వ, ఒక ప్రయివేటు కలిపి ఆరు పాలిటెక్నిక్ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,209 సీట్లున్నాయని పేర్కొన్నారు. అందులో 11,079 (77.9 శాతం) సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఇంకా 3,130 (22.1 శాతం) సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 56 ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 15,240 సీట్లుంటే, 7,188 (47.1 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 8,052 (52.9 శాతం) సీట్లు మిగిలాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 728 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ట్యూషన్ ఫీజును చెల్లించాలని కోరారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు మంగళవారం వరకు గడువుందని తెలిపారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు ఎప్‌సెట్ రెండో విడత సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రక్రియలో భాగంగా బుధవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించనుంది. ఈ నెల 25న రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. 26న ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. 26,27 తేదీల్లో అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 1,16,877 సీట్లున్నాయి. అందులో కన్వీనర్ కోటాలో 90,921 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్‌సెట్ మొదటి విడతలో 59,980 మంది అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. దీంతో ఎప్‌సెట్ రెండో విడతలో కన్వీనర్ కోటాలో 30,941 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయి. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి

- ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చలో ఢిల్లీ
- ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతితో భేటీ
- సానుకూలంగా స్పందిస్తే ఒకే.. లేదంటే పోరాటమే
- క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు


క్యాబినెట్ నిర్ణయాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు పొన్నం, శ్రీహరి, కొండ సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లను బిజెపి అడ్డుకుంటోంది. 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం మోడీ సర్కార్‌పై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రపతిని కలవాలని క్యాబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశం వివిధ అంశాలపై ఐదు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండ సురేఖ మీడియాకు వివరించారు. "కేంద్రం జోక్యం చేసుకొని రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లులు ఆమోదింపచేయాలి. బిజెపి ఎంపీలు అర్వింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్య, లక్ష్మణ్‌లు సహకరించాలి. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతున్నారు. సామాజిక న్యాయం పాటించని కమలదళం పార్టీకి బిసిల గురించి మాట్లాడే అర్హత లేదు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 మంది ఎంపిలతో పాటు రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు, బిసి సంఘాలతో కలిసి ఆగస్టు 5,6,7 తేదీల్లో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిని కలిసి వివరిస్తాం" అని ప్రభాకర్ తెలిపారు. బిసి ఉద్యమం మరో తెలంగాణ ఉద్యమం లాగా మారకముందే కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. విపక్షాలు కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోరేవారంతా తమతో కలిసి ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. "గతంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. బిఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తగ్గించింది. రిజర్వేషన్ల పెంపు బిల్లును మేం మార్చి 30న రాష్ట్రపతికి పంపించాం. పది శాతం ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం కోటా దాటిపోయింది. ఇడబ్ల్యూఎస్‌కు అడ్డురాని 50 శాతం కోటా బిసిల విషయంలో మాత్రమే ఎందుకు అడ్డువస్తుంది? సామదానభేద దండోపాయాలు అన్నట్టుగా అన్ని రకాలుగా పోరాడుతాం"అని మంత్రి పొన్నం తెలిపారు. బిసి రిజర్వేషన్ల సాధనలో అన్ని పార్టీలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్ల చేతుల్లో చదువు

- ఆగస్టు 22న విడుదలయ్యే 'యూనివర్సిటీ' సినిమాని ఆదరించాలి
- సినీ నటులు ఆర్ నారాయణమూర్తి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ నారాయణమూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేడు చదువు కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకుందని, చదువుకునే రోజుల నుంచి చదువు కొనుక్కునే పరిస్థితులు వచ్చాయని సినీనటులు, దర్శకులు పీపుల్ స్టార్ ఆర్. నారాయణ మూర్తి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో 'యూనివర్సిటీ.. పేపర్ లీకేజ్' సినిమా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ చూసినా పేపర్ లీకేజీ అనేది సర్వసాధారణంగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీక్ అవ్వడం, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థుల పరీక్ష పత్రాలు లీక్ అవ్వడం అంటే సమాజాన్ని నాశనం చేయడమేనని అన్నారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని ఆరోపించారు. తన సినిమాని ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు, నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో చూసి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, తదితర విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సామాజిక అసమానతలపై, విద్య, వైద్యం, క్లాసిఫికేషన్, క్యాస్టిఫికేషన్ అంశాలపై సినిమాలు తీస్తూ తన జీవితాన్ని కళామ్మ తల్లికి అంకితం చేసి, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నారాయణ మూర్తి పాటుపడుతున్నారని అన్నారు. సినిమా రూపంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెండితెరపై దశాబ్దాలుగా ప్రజల జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కండ్లకు కట్టినట్టు చూపించారని తెలిపారు. కార్పొరేట్ కబంధహస్తాల్లో చిక్కుకున్న చదువుపై చిత్రాన్ని రూపొందించారని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణ్, నాయకులు వినయ్, హర్షద్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు వినయ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ, యూనివర్సిటీ అధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

ఎసి రెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం

- మోడీ పాలనలో పెరిగిన పేదరికం ఆర్థిక అసమానతలు
- సోషలిజమే దేశానికి ప్రత్యామ్నాయం : జాన్‌వెస్లీ
- ఘనంగా ఎసి రెడ్డి నరసింహారెడ్డి 34వ వర్ధంతి సభ


సభలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జనగామ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసిన ప్రజా నేత ఎసి రెడ్డి నరసింహారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సోమవారం ఎసి రెడ్డి నరసింహారెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా పార్టీ జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ పార్క్ నుంచి ఆర్‌టిసి చౌరస్తా మీదుగా సాయిరాం కన్వెన్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ముందుగా ఏసీ రెడ్డి నరసింహారెడ్డి చిత్రపటానికి, ముదిగొండలో భూపోరాటంలో అమరులైన వారికి, కేరళ మాజీ ముఖ్యమంత్రికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కేంద్రంలో 11 ఏళ్ల బిజెపి పాలనలో ప్రజల మధ్యన ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రాయితీలిస్తున్న ప్రభుత్వం.. ఓట్లు వేసి గెలిపించిన సామాన్య ప్రజలపై మాత్రం జీఎస్‌టి పేరుతో పన్నుల భారాలు వేస్తుందని విమర్శించారు. ఫలితంగా దేశంలో సుమారు 80కోట్ల మంది ప్రజలు ఆహార ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్లు తీసుకొచ్చారని, ఎనిమిది గంటల నుంచి 12 గంటలకు పని గంటలను పెంచి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా విద్వేషాలు రెచ్చగొడుతూ పాలన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల్లో నది జలాల సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఎన్నికల కమిషన్‌ను స్వతంత్రంగా పనిచేయనీయకుండా బిజెపి సంస్థగా మార్చే కుట్ర చేస్తోందని ఆరోపించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్థానిక సమస్యలపై ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో గ్రామాలు, పట్టణాల్లో పార్టీ కార్యకర్తలు పర్యటించి అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంజిల్లాలో టూరిజంపై దృష్టి సారించండి

- సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేయడంతోపాటు టూరిజం సెక్టార్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఖమ్మం టూరిజం అభివృద్ధిపై సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో ఏకో, టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం టెంపుల్, కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరిత హోటల్, కనిగిరి హిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్ పార్కు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే, ఖమ్మంలో కొత్తగా ఒక హరిత హోటల్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో టూరిజం శాఖకు చెందిన అధికారులు, జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి తగు కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఖమ్మం పట్టణ సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఏకో టూరిజానికి సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డీ వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం అర్బన్ నియోజకవర్గంలో మంజూరైన కొత్త రేషన్ కార్డులను లబ్దిదారులకు అదనపు కలెక్టర్ అంకింత్ కలిసి షబ్బీర్ అలీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేదని అన్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్డులు అందిస్తోందని, ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 11,852 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మరో 84,232 మంది సభ్యుల పేర్లను కొత్తగా రేషన్ కార్డుల జాబితాలో చేర్చినట్టు వివరించారు. గత ప్రభుత్వం చేసిన రూ.7.80 లక్షల కోట్ల అప్పుల భారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నారని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ బిజెపి పాలిత రాష్ట్రాలు సహా దేశంలోనే మరెక్కడా లేదని, కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతోందన్నారు.

ఇంజనీరింగ్ ఫీజులపై నేడు అధికారుల కమిటీ సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యా కోర్సుల ఫీజుల విధివిధానాల రూపకల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ మొదటి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరగనుంది. ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశంలో అధికారుల కమిటీ సభ్య కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, సభ్యులు ఎ శ్రీదేవసేన, ఎన్ క్షితిజ, ఎం వెంకటేశ్వరరావు, ఎస్ దేవేందర్‌రెడ్డి, కె వెంకటేశ్వరరావు, ఎ కృష్ణయ్యతోపాటు చైర్మన్ నియమించే ఇద్దరు సబ్జెక్టుల నిపుణులు హాజరవుతారు. 2025-28 బ్లాక్ పీరియెడ్‌కు సంబంధించి ఇంజనీరింగ్ సహా వృత్తి విద్యాకోర్సుల ఫీజుల ఖరారుకు సంబంధించి విధివిధానాలపై చర్చిస్తారు. సుప్రీంకోర్టు, హైకోర్టు మార్గదర్శకాలు, ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ఫీజులు వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. కాలేజీలు పాటిస్తున్న ప్రమాణాలు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, ఎఐసిటిఇ, విశ్వవిద్యాలయాల నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నియామకం వంటి అంశాలను ఆ కమిటీ పరిశీలిస్తుంది.

స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలి

- ఏజిని కోరిన మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంబీబీఎస్ కౌన్సిలింగ్‌కు సంబంధించి స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని వైద్యారోగ్యశాఖ మంత్రి అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూతో కలిసి ఆయన సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి చర్చించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా కోర్టులో వాదనలు వినిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టులో వాదనల కోసం, అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా, స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా గతేడాది జీవో 33ను ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ స్థానిక కోటాలో తమకు కూడా సీట్లు ఇవ్వాలని ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఆగస్టు 5న సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలోనే ఏజీని కలిసిన మంత్రి, స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

ఆగస్టు 18 నుంచి డిఇఎల్ఇడి ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఎల్ఇడి) ద్వితీయ సంవత్సరం చదువుతున్న (2023-2025 బ్యాచ్) విద్యార్థులకు వచ్చేనెల 18 నుంచి ఫైనల్ లెసన్ టీచింగ్ ప్రాక్టికల్ (ఎఫ్ఎల్‌టిపి) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు సోమవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ రెండో విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కాలేజీల్లోని ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.

పత్తి రైతులకు డబ్బులు చెల్లించాలి

- సీడ్ కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జోగులంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను నెల రోజుల్లోగా చెల్లించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీడ్స్ కంపెనీలను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారని తెలిపారు. నెలలు గడిచినా రైతులకు కంపెనీలు డబ్బులు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి విత్తనాల ఉత్పత్తిలో గద్వాల దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. విత్తన ఉత్పత్తి చేసి కంపెనీలకు ఇస్తే...రైతులకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఆయా కంపెనీలు తక్షణమే స్పందించి నెలరోజుల్లోగా ఉన్న బకాయిలను రైతులకు చెల్లించి వారిని ఆదుకోవాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. ఆయా కంపెనీల ద్వారా రైతులకు సుమారు రూ.700 కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. రైతులు, వారిపై ఆధారపడిన కూలీలు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కృష్ణామోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, రాష్ట్ర సీడ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుదా ఘతంతో కౌలు రైతు మృతి

- కరెంటు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోరు మోటర్ వద్ద స్టార్టర్ డబ్బా మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కౌలు రైతు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం వాడి గ్రామానికి చెందిన ఆకుల జగన్నాథం (50) కొన్నేండ్లుగా అదే గ్రామానికి చెందిన ఓ రైతు దగ్గర సుమారు మూడు ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బోరు మోటార్ నడవకపోవడంతో స్టార్టర్ డబ్బా వద్ద సర్వీస్ వైర్‌ను పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. దాంతో జగన్నాథం అక్కడికక్కడే మృతిచెందారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు. కాగా, విద్యుత్ అంతరాయంపై ట్రాన్స్‌కో అధికారులను ఎల్‌సీ ఇవ్వాలని కోరినా ఇవ్వకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల కాలంలోనే ఇద్దరు రైతులు కరెంటు షాక్‌తో మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

యాపిల్ బ్రాండ్స్ పేరుతో నకిలీ పరికరాల విక్రయాలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రూ.3 కోట్ల ఎలక్ట్రానిక్ వస్తువుల స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కంపెనీ యాపిల్ బ్రాండ్స్ పేరుతో నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువులను విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను సోమవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.మూడు కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం..

మీరాలంమండికి చెందిన మొహమ్మద్ సాహిద్ అలీ, ఎల్బీనగర్‌కు చెందిన ఇర్ఫాన్ అలీ, అఫ్జల్‌గంజ్‌కి చెందిన సంతోష్ రాజ్‌పురోహిత్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. యాపిల్ వాచ్‌లు, యాపిల్ ఎయిర్‌పాడ్స్, యూఎస్‌బీ కేబుల్, యాపిల్ మ్యాగ్ సేఫ్ పవర్ బ్యాంక్‌తోపాటు ఇతర ఎలాక్ట్రానిక్ వస్తువులను(నకిలీ) యాపిల్ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిఘా వేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

పౌల్ట్రీ రైతులకు అన్ని విధాల సహాయం

- ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్ : తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ (టిపిఎఫ్) నగరంలోని పెద్ద అంబర్‌పేట్‌లో 'కల్ బర్డ్ సింగిల్ విండో - 5 రీజియన్స్' భవనాన్ని ప్రారంభించింది. ఈ కొత్త సదుపాయం తెలంగాణ, పరిసర రాష్ట్రాల్లో పౌల్ట్రీ రంగానికి మౌలిక సదుపాయాలు, నిర్వహణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో మైలురాయిగా నిలువనుందని ఆ వర్గాలు తెలిపాయి. దీని ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరు కాగా.. నల్గొండ మాజీ జడ్‌పి చైర్మన్ కాసిరెడ్డి నారాయణ రెడ్డి, టిపిఎఫ్ అధ్యక్షుడు కాసర్ల మోహన్ రెడ్డి, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బాయాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. పౌల్ట్రీ పరిశ్రమకు పితామహుడిగా పేరుగాంచిన బివి రావు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ రంగంలోని రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని తెలిపారు. విద్యుత్ సబ్సిడీ, షెడ్ నిర్మాణ అనుమతుల విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ముదిగొండ భూపోరాటం చిరస్మరణీయం

- మత ఘర్షణలను రెచ్చగొడుతున్న బిజెపి
- స్థానిక ప్రజా ఉద్యమాలతోనే సిపిఎం బలోపేతం
- ముదిగొండ భూపోరాట అమరవీరుల 18వ వర్ధంతి సభలో తమ్మినేని



సభలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూపోరాటం చిరస్మరణీయమైనదని, భూమి ఉన్నంతవరకూ ఎర్రజెండా పోరాటాలు ఉంటాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ భూపోరాట అమరవీరుల 18వ వర్ధంతి సభ ముదిగొండ మండల కేంద్రంలోని భూపోరాట వీరుల స్మారక స్థూపం వద్ద పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. పోలీస్ తూటాలకు ఎదురొడ్డి అమరులైన యోధులు ఉసికల గోపయ్య, ఎనగందుల వీరన్న, కత్తుల పెద్దలక్ష్మి, బంక గోపయ్య, పసుపులేటి కుటుంబరావు, జంగం బాలస్వామి, చిట్టూరి బాబురావు అమరత్వంతో తడిసిన నేల ముదిగొండ గడ్డని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2007 జులై 28న నిరుపేదలు, వ్యవసాయ కార్మికులు జానెడు ఇంటి స్థలం కోసం ఆందోళన చేస్తే ఆనాటి వైఎస్ ప్రభుత్వం కర్కశంగా లాఠీచార్జి చేశారని అన్నారు. పోలీసులు కాల్పులు జరిపి ఏడుగురిని బలి తీసుకున్నారని, 18 మంది గాయపడ్డారని తెలిపారు. మండలంలో బలమైన పార్టీగా ఉన్న సిపిఎంను బలహీనపరిచి దెబ్బతీయాలని భావించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం.. కుట్రలకు తెరలేపి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టిందన్నారు. రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు కాకుండా అర్హులకు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజా ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలన్నారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. పాలకులు ప్రజా సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ప్రధాని మోడీ ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి దేశ ప్రజలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కులం, మతం పేరుతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి హిందూమతాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ముదిగొండ భూపోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. అనంతరం భూపోరాట అమరవీరుల చిత్రపటాల స్థూపం వద్ద కుటుంబసభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి పద్మ, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, డివిజన్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, మాజీ ఎంపిపి మంకెన దామోదర్, మండల నాయకులు వేల్పుల భద్రయ్య, అమరవీరుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌తో జాగ్రత్త

- ప్రతి నిమిషం ఇద్దరి మరణం
- డాక్టర్ కెఎస్ సోమశేఖర్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హెపటైటీస్ సంబంధిత వ్యాధులతో ప్రతి నిమిషం ఇద్దరు చొప్పున మరణిస్తున్నారని హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్ డాక్టర్ కెఎస్ సోమశేఖర్ రావు తెలిపారు. ప్రపంచ హెపటైటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ ఇమ్యూలాజికల్స్ లిమిటెడ్ సహకారంతో యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉదయం వాకర్లను కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో చాలా వరకు నివారించగలిగిన జబ్బులే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలేయ ఆరోగ్యం పట్ల ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవడం, ముందుగానే పరీక్షలు చేసుకోకపోవడం, వ్యాక్సిన్ వేసుకోకపోవడం, వ్యాధులు ముదిరి లక్షణాలు కనిపించిన తర్వాతే వైద్యులను సంప్రదించడం కూడా మరణాలు పెరగడానికి కారణమవుతుందని తెలిపారు. హెపటైటీస్‌ను నిర్మూలించడం ద్వారా లివర్ సిర్రోసిస్, లివర్ క్యాన్సర్లను అరికట్టవచ్చని తెలిపారు. హెచ్బీఎస్ఏజీ, యాంటీ-హెచ్ సీవీ పరీక్షలు అవసరమైన వారికి వెంటనే చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నవీన్ పోలవరపు తదితరులు పాల్గొన్నారు.

ఇజిఎస్ నిధులను పంచాయతీల ఖాతాల్లో జమచేయాలి

- పెండింగ్ బిల్లులు విడుదల చేశాకే స్థానిక ఎన్నికల నిర్వహించాలి : యాదయ్యగౌడ్


జాయింట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యాదయ్యగౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర విడుదల చేసిన ఇజిఎస్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంచాయతీల ఖాతాల్లో జమచేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ కోరారు. రాష్ట్రంలో మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ ఎం శేషు కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెఎసి సహకార్యదర్శి రాజేందర్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం నెల కిందనే ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన రూ.1200 కోట్ల నిధులను విడుదల చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఇప్పటికీ పంచాయతీల ఖాతాల్లో వేయలేదని ఎత్తిచూపారు. తమ పదవీకాలం అయిపోయి 19 నెలలు అవుతున్నా ఇంకా పెండింగ్ బిల్లులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మాజీ సర్పంచుల ఆత్మహత్యలను నివారించే బాధ్యత రాష్ట్ర సర్కారుపై ఉందన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

కొనసాగుతున్న 'సృష్టి' దర్యాప్తు

- కూకట్‌పల్లి, కొండాపూర్ బ్రాంచీల నుంచి ఫైల్స్ స్వాధీనం
- ఐవిఎఫ్, సరోగసీ ద్వారా సంతానం పొందిన వారి వివరాలు సేకరణ
- అందుబాటులోకి రాని దంపతులు
- సుమోటోగా స్వీకరించి విచారణకు హెచ్‌ఆర్‌సి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్‌లోని 'సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్' కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆస్పత్రి నుంచి భారీ సంఖ్యలో ఫైల్స్ సేకరించారు. గతంలో ఐవీఎఫ్‌తోపాటు సరోగసీ పద్ధతిలో సంతానం పొందిన దంపతుల వివరాలు కూడా సేకరించారు. అయితే కొంతమంది స్పందించకపోవడం, ఫోన్ ఎత్తకపోవడం, ఫోన్ కట్ చేయడం, స్విచ్ఛాఫ్ చేయడం వంటి సమస్యలు వారి నుంచి ఎదురైనట్టు పోలీసులు తెలిపారు. నాలుగు రోజులుగా 'సృష్టి' అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో భయంతో దంపతులు ఫోన్ కాల్స్‌కు అందుబాటులోకి రాలేదని తెలిసింది. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కి సంబంధించి రంగారెడ్డి జిల్లా కొండాపూర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో కూడా బ్రాంచీలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడ కూడా వివరాలు సేకరిస్తున్నారు.



'గాంధీ' పాత్రపై ఆరా..!

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు కొందరు ప్రయివేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులతో కుమ్మక్కవుతున్నట్టు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు ఉచితంగా అందించాల్సిన దాదాపు రూ.రెండు లక్షల విలువైన మందులను 2023లో వారాసిగూడలోని ఓ ప్రయివేటు మెడికల్ షాపులో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో సర్కార్ మందులు లభ్యం కావడం.. దగ్గరలో ఉన్న గాంధీ ఆస్పత్రి నుంచే సరఫరా అయినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ మెడికల్ షాపుకు ఆ మందులను ఎవరు సరఫరా చేశారనే విషయాలపై అప్పట్లో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దర్యాప్తు చేపట్టినా.. వివరాలను బయటికి వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. ఇప్పుడు సరోగసీ వ్యవహారంలో మరోసారి గాంధీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ ఉండటంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో అరెస్టు చేసిన ఎనమిది మంది నిందితుల్లో గాంధీ ఆస్పత్రిలో పని చేస్తున్న అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్గుల సదానందం కూడా ఉన్నారు. డాక్టర్ నమ్రతతో కలిసి ఆయన కూడా ఈ వ్యవహారంలో పాలు పంచుకున్నట్టు తేలడంతో సదానందంను 14 రోజులు రిమాండ్‌కు పంపారు. ఆయన పాత్రపై పోలీసులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ అధికారి అయ్యి ఉండి, ప్రయివేటు ఆస్పత్రికి సహాయ సహకారాలు అందించడం వెనుక ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

హెచ్‌ఆర్‌సి ఆగ్రహం.. విచారణకు ఆదేశం

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో చేపట్టిన అక్రమ సరోగసీ, శిశువుల విక్రయం పట్ల రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వివాహమై ఏండ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టని దంపతులను ఈ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ నమ్రత మోసం చేయడాన్ని హెచ్‌ఆర్సీ తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు నవతెలంగాణతోపాటు ఇతర మీడియాలో ప్రచురితమైన కథనాలకు హెచ్‌ఆర్సీ చైర్మెన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ స్పందించి కేసును సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీలోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చట్టవిరుద్ధమైన, అనైతికమైన పద్ధతులను సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత ఎంచుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిసెంబర్‌లో యాడ్ డిజైన్ షో

హైదరాబాద్ : డిజైన్, కళ, ఆవిష్కరణలకు సంబంధించిన యాడ్ డిజైన్ షో-2025 తొలిసారి హైదరాబాద్‌కు రానుందని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. పిడిలైట్‌తో కలిసి నిర్వహించన్న ఈ షోను ఇక్కడ డిసెంబర్ 5.6 తేదిల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఇంతకు ముందు ముంబయిలో నవంబర్ 21-23 తేదిల్లో జరగనుందని ఎడి ఇండియా హెడ్ కోమల్ శర్మ తెలిపారు.



దశాబ్దకాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

- తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి కల్చరల్

దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. కంటం ఫౌండేషన్, సీల్ వెల్ కార్పొరేషన్ సహకారంతో తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. తెలంగాణ బిసి కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారంతో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, నేటి నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు. తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తెలంగాణ భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికిష్ణ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్, ప్రాగ్నిక అధినేత కె ప్రవీణ్ కుమార్, మార్గం రాజేష్, రాగిరి సత్యనారాయణ గౌగాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీనియర్ నాయకురాలు మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు.

సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి

- మృతుల కుటుంబాలకు కోటి నగదు వెంటనే చెల్లించాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందడానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని, మృతుల కుటుంబాలకు వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సిగాచి బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. దారుణమైన ప్రమాదం జరిగి అనేక మంది మరణించగా, ఇంకొందరు తీవ్రంగా గాయాలపాలైన ఘటన జరిగిన తర్వాత కంపెనీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాగలేదన్నారు. కంపెనీ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం నుంచి 15 రోజుల్లో అందేలా చర్యలు తీసుకుంటామని సిఎం హామీ ఇచ్చి నెల రోజులైనా ఎందుకు డబ్బులు ఇప్పించలేదని ప్రశ్నించారు. తీవ్రంగా గాయపడ్డ కార్మికులకు రూ.50 లక్షలు, తక్కువ గాయాలైన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఎపితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు సంగారెడ్డికి వచ్చి వెళ్లాలంటే రూ.20 వేల ఖర్చు అవుతున్నందున చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చనిపోయిన వారి పేర్లు, ఎవరెవరికి ఎంత సాయం చేశారో.. గాయపడిన వారికి ఎంత ఇచ్చారనే వివరాల్ని ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతుందని ప్రశ్నించారు. యాజమాన్యం పూర్తి నిర్లక్షంగా వ్యవహరించిందని ఫిర్యాదు చేసినా ఎందుకని యాజమాన్యాన్ని రేవంత్‌రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. కంపెనీతో ఉన్న లాలూచీ ఏమిటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మృతదేహాలు ఇవ్వకుండా ఎనిమిది మంది మిస్సింగ్ అంటూ ఎందుకు వేధిస్తున్నారన్నారు. వారికి వెంటనే డెత్ సర్టిఫికెట్స్ ఇచ్చి ఆ కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు.

బరువు తగ్గుదలపై విరించి 'నాలెడ్జ్ ఎన్‌క్లేవ్' ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

విరించి హాస్పిటల్స్ నగరంలో "రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ వెయిట్ లాస్ ట్రీట్మెంట్" అనే అంశంపై విరించి నాలెడ్జ్ ఎంక్లేవ్ అనే కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) సెషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఒబెసిటీపై ఈ సెషన్‌లో అవగాహన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపుణులు డాక్టర్ వై కృష్ణ మోహన్ (రోబోటిక్ బారియాట్రిక్ సర్జన్), డాక్టర్ వృందా అగ్రవాల్ (ఎండోక్రినాలజిస్ట్), డాక్టర్ బత్తుల అరుణ్ కుమార్ (చీఫ్ డైటిషియన్) శస్త్రచికిత్స, ఫార్మకాలాజికల్, ఆహార వ్యూహాలపై తమ అనుభవాలను వెల్లడించారు. ఒబెసిటీ నిర్వహణలో శస్త్రచికిత్స, ఔషధాలు, భావోద్వేగ, సాంకేతిక సాధనాల సమన్వయంపై ప్రధాన చర్చ జరిగింది. విరించి హాస్పిటల్స్ రోగులకు మంచి ఫలితాల కోసం ఈ రకమైన క్లినికల్ విద్యా కార్యక్రమాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉందని ఆ హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు.

న్యూకాసిల్ యునైటెడ్‌తో విటి మార్కెట్ భాగస్వామ్యం

హైదరాబాద్: న్యూకాసిల్ యునైటెడ్‌తో భాగస్వామ్యంతో ఆసియాలో కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలను ప్రారంభించినట్లు ట్రేడింగ్ వేదిక విటి మార్కెట్స్ తెలిపింది. విటి మార్కెట్ తన 10 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా దక్షిణాసియాలోని పాఠశాలలకు 1,000 ఫుట్‌బాల్స్ విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపింది. అదే విధంగా న్యూకాసిల్‌కు 20,000 ఫౌండ్స్ (రూ.23 లక్షలు) విరాళంగా ఇచ్చినట్లు పేర్కొంది.

కుటుంబ తగాదాలతో.. అత్త దారుణ హత్య

- తమ్ముడి సాయంతో వేటకొడవళ్లతో అల్లుడి ఘాతుకం
- పరారీలో నిందితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ తగాదాలతో అతి కిరాతకంగా వేట కొడవళ్లతో అత్తను అల్లుడు నరికి చంపిన ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజరలో సోమవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజరకు చెందిన జంగిలి యాదగిరి, వజ్రమ్మ (55)కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమార్తె భవాని కుటుంబంతో కలిసి యాదగిరి దంపతులూ హైదరాబాద్‌లో ఒకే బిల్డింగ్‌లో ఉండేవారు. అయితే భవానీకి ఆమె భర్త మహేష్‌కు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వారం క్రితం మహేష్‌పై మద్దూరు పోలీసులకు భవాని ఫిర్యాదు చేసింది. అనంతరం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా, ఇకముందు ఇద్దరూ కలిసి ఉండాలని సూచించారు. దాంతో భవాని, ఆమె ముగ్గురు పిల్లలను ధర్మారంలోని మహేష్ ఇంట్లో ఆమె తల్లిదండ్రులు వదిలేసి వెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ వెళ్తానని చెప్పిన మహేష్.. బంజరకు వెళ్లాడు. హైదరాబాద్‌లోని ఇంటి తాళం చెవిలు ఇవ్వాలని అత్తమామలను కోరగా.. వారు నిరాకరించారు. దాంతో కోపోద్రిక్తుడై తన తమ్ముడు హరీశ్‌ను తీసుకొని బంజరకు తిరిగి వెళ్లాడు. గ్రామంలోని జంగిలి మల్లేశం ఇంటి వద్ద వజ్రమ్మ కనిపించగా.. తమ్ముని సాయంతో వేట కొడవళ్లతో మహేష్ ఆమెపై దాడి చేసి అతి కిరాతంగా హత్య చేశాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు అరవడంతో వాళ్లు పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్.. సిద్దిపేట క్లూస్ టీం అధికారులకు సమాచారం అందించి హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. హత్య నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ సిఐ శ్రీను, చేర్యాల ఎస్ఐ నవీన్, కొమురవెల్లి ఎస్ఐ రాజు పర్యవేక్షిస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి

- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి : వెంకటేష్
- కొనసాగుతున్న యువ చైతన్య సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను నిషేధించాలని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. అంబేద్కర్, మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, కాకతీయ డిగ్రీ కళాశాల దగ్గర జరిగిన సభల్లో వెంకటేష్ మాట్లాడారు. అనేకమంది విద్యార్థులు, యువత గంజాయికి, డ్రగ్స్‌కు బానిసలుగా మారి బంగారం లాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమై కుటుంబాలకు భారమవుతున్నారన్నారు. దేశ భవిష్యత్, అభివృద్ధి యువతపై ఆధారపడి ఉందన్నారు. దేశం వివిధ రంగాల్లో రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమన్నారు. మార్పు రావాల్సింది యువతలో, మార్పు తేవాల్సింది కూడా యువతే అని చెప్పారు. దురదృష్టవశాత్తు నేడు యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తుకు బానిసలుగా మారి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తి సామర్థ్యాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించినా.. ప్రచారం చేస్తున్నా డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయాలని, ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించి యువత ప్రాణాలను కాపాడాలన్నారు.

జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్నా స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవినాయక్, మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, యాత్ర సభ్యులు పుల్లెంల శ్రీకర్, గుండాల నరేష్, కట్ట లింగస్వామి, వడ్డగాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.


సైకిల్ యాత్రలో యువకులు